క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత

రఘునాథపాలెం: మండలంలోని సూర్య తండాలో ఇటీవల మృతి చెందిన జాటోతు వాలియా కుటుంబానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వంలోని పువ్వాడ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం ప్రకటించారు. ఈమేరకు వాలియా కుటుంబానికి సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్, ఆత్మ చైర్మన్ లక్ష్మణ్‌నాయక్, సుధాకర్, సూర్య, రవికిరణ్ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంక్ ప్రారంభం



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా నెహ్రూ యువక కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరు పాడు గ్రామంలో సోమవారం శ్రమదాన్ శివిర్ మినీ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. పువ్వాడ నగర్ జాగృతి అసోసియేషన్ అధ్యక్షుడు షారుఖ్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌వైకె అకౌంట్స్ ఆఫీసర్ భానుచందర్, సర్పంచ్ బండి ఉపేందర్, మాజీ సర్పంచ్ కర్ణ కుమార్, మునిగాల సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి గోపయ్య, లక్ష్మీనారాయణ, ఉషా పాల్గొన్నారు.

మహావీర్ జయంతి



పూజలు నిర్వహిస్తున్న జైనులు

ఖమ్మంగాంధీచౌక్: జైనమత గురువు మహావీర్ జయంతి వేడుకలను సోమవారం ఖమ్మం నగరంలో ఆ మతస్తులు జరుపుకున్నారు. నగరంలోని రైల్వే మధ్య గేటు వద్ద ఉన్న జైన మత చేతాల మందిరంలో జైన్ పరివార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. పూజారి కాలా ఇందుజైన్ మహావీర్ జయంతి ఉత్సవాలను, అభిషేకాలు, పుణ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజయ్, సంతోష్, విమల్, అంకిత్, లలిత్, సీతల్, సునిత్, గునుమాల, కిరణ్, కవిత, కోమల్, శోభ పాల్గొన్నారు.

మత్స్యపారిశ్రామిక సంఘం కార్యవర్గం ఎన్నిక



కమిటీ వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. మత్స్యశాఖ కార్యాలయం జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి ఆధ్వర్యాన పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా చింతల నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా చింతల వీరయ్య, కార్యదర్శిగా చింతల ఉపేందర్, డైరెక్టర్లుగా గోపి, మట్టపల్లి నాగేశ్వరరావు, రమేష్, వెంకటరత్నం, వెంకటేష్, గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు నరసింహారావు మాట్లాడుతూ సంఘం బలోపేతం, సభ్యులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.

అంధకారంలో బ్యాంక్ కాలనీ



కాలనీలోని ఒక వీధి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని బ్యాంక్ కాలనీలో మూడు రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఆ ప్రాంతంలోని పలు వీధులు అంధకారంలో ఉంటున్నాయి. వీధి దీపాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కేఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	ఆరెంజ్
ఆదిత్య	దసరా
శ్రీనివాస	దాస్ కా దమ్కి
సుందర్	రంగమార్తాండ

- ఖమ్మం గాంధీచౌక్

మేమింతే..

ఇంటింటికి చెత్త సేకరిస్తున్నా రోడ్ల వెంట వేస్తున్న నగరవాసులు

- డంపింగ్‌యార్డులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- ఫెన్సింగ్ తొలగించి మరీ పోస్తున్న వైనం



మామిళ్లగూడెం విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం గోడ పక్కన పోసిన వ్యర్థాలు



సాయిబాబు గుడి రోడ్డులో..

ఖమ్మంమయూరిసెంటర్: వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా, క్లీన్ ఖమ్మంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు కేఎంసీ అధికారులు, పాలకులు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు వెంట, కూడళ్లల్లో వ్యర్థాలు వేయకుండా నేరుగా సేకరించేలా అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగేళ్లుగా నగరంలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. కానీ నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో మాత్రం రోడ్డు వెంట వ్యర్థాలు పోస్తున్నారు. అధికారులు పలుమార్లు స్థానికులకు అవగాహన కల్పించినా వ్యర్థాలు రోడ్డు వెంట వేస్తుండడంతో ఆ ప్రాంతంలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

బోర్డులు పెట్టినా..

నగరంలో రోజుకు 170 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తారు. చెత్త సేకరణకు 60 కేఎంసీ ట్రాక్టర్లు, 45 స్వచ్ఛ ఆటోలు, 10 కమర్షియల్ ట్రాక్టర్లు, 30 ప్రైవేటు ఆటోలు ఉన్నాయి. చెత్త సేకరణ ప్రారంభించిన తర్వాత నగరంలోని రోడ్ల వెంట, కూడళ్లల్లో చెత్త పాయింట్లను తొలగించారు. గతంలో చెత్త వేసే పాయింట్లలో అధికారులు ప్రత్యేకంగా మొక్కలు నాటడంతో పాటు వాటికి రక్షణగా ఫెన్సింగ్ చేశారు. చెత్త వేయకూడదంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా పలు వీధుల్లో రోడ్ల వెంట వ్యర్థాలను వేస్తూనే ఉన్నారు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లడం, కుక్కలు వ్యర్థాల్లో తిరగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినా కొంత మంది చెత్తను పోస్తుండడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందుకు కేఎంసీ వాహనం వచ్చిన సమయంలో వ్యర్థాలను కార్మికులకు ఇవ్వకుండా రోడ్డు వెంట చెత్త పోయడమేంటని ప్రశ్నిస్తున్నారు.

అవగాహన అవసరం..

ఇంటి ముందుకు వచ్చిన చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే చెత్తను అందించాలని, రోడ్డు వెంట వేయొద్దని అధికారులు, సిబ్బంది గతంలో విస్తృత ప్రచారం చేశారు. దీంతో నగరంలో 90 శాతంకు పైగా వ్యర్థాలను చెత్త సేకరణ వాహనానికే అందజేస్తున్నారు. అయితే నగరంలోని కొందరు ఇంకా రోడ్ల వెంటనే చెత్త వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలోని ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట చెత్త నిండిపోయి డంపింగ్‌యార్డ్‌లను తలపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా మరోసారి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆ ప్రాంతంలో నివాసం ఉండే వారు కోరుతున్నారు.

ప్రజల్లో బాధ్యత పెరగాలి



నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేపడుతున్నాం. రోడ్లు, కూడళ్ల వెంట వ్యర్థాలు వేయకుండా చెత్త పాయింట్లను తొలగించాం. రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా ఇంటి ముందుకు వాహనంతో వచ్చిన పారిశుద్ధ్య కార్మికులకు అందించాలి. ఖమ్మంను క్లీన్ సిటీగా ఉంచేందుకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

మహిళా, శిశు సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంకటగిరి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ పక్షోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులకు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తున్నట్లు, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచి బలవర్ధకమైన ఆహారాన్ని ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా నిధులు కేటాయించి పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గుర్రాలపాడులో కాటయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న ప్రజా ప్రతినిధులు

తిరుమలాయపాలెం: గ్రామాల్లో యథేచ్ఛగా నడుస్తున్న బెల్ట్ షాపులను నియంత్రించడంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం మండల ప్రజా ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ మంగీలాల్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మద్యం అమ్మకాలపై అధికారులను నిలదీశారు. మద్యం ధరలు పెంచి అమ్ముతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మండల పరిషత్ సమావేశంలో అధికారుల గైర్హాజరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సమావేశాలకు రానప్పుడు మండల పరిషత్ సమావేశం ఎందుకని ప్రశ్నించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు ఏ ఆహారం అందిస్తున్నారో కనీసం ప్రజా ప్రతినిధులకు సమాచారం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జయరాం ఎంపీపీ మంగీలాల్ పలు శాఖల అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఖురాన్ బోధనలతో సాఫల్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖురాన్ బోధనలతో సాఫల్యం పొందవచ్చని జమాతె ఇస్లామి హింద్ మహిళా అధ్యక్షురాలు సైదాభాను అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఖురాన్‌లో ఉన్న ప్రవక్తల గాథలు, అల్లాహ్ ఆదేశాలు షరిఅత్ విధి విధానాలు, జీవనరీతి, జీవిత పరమార్థం తదితర విషయాల్లో అవగాహన కలుగుతుందన్నారు. ఖమ్మం నగరంలో వంద చోట్ల సమాతే ఖురాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రహిమున్నీసా, వహేదా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదంపై ఉద్యమించాలి

ఖమ్మంరూరల్: బీజేపీ మతోన్మాద రాజకీయంపై కార్యకర్తలు ఉద్యమించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో జరిగిన కస్నా తండా గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అన్ని కులాలు, మతాలకు నిలయమైన భారతదేశంలో బీజేపీ మాటున ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని వ్యాప్తి చేసే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ కేవలం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, అందులో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థలను చౌకబారుగా వారికి కట్టబెడుతున్నారన్నారు. చినవెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, రాంమూర్తినాయక్, సురేందర్, కె.శ్రీనివాసరెడ్డి, భాస్కర్, వెంపటి రాము పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపునకు దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్‌ఐ, కార్పొరేటర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8, 15వ డివిజన్ల పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎనిమిదో డివిజన్‌లో 96, 15వ డివిజన్‌లో 144 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చివరి దశలో ఉండగా, సోమవారం దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టారు. మంగళ, బుధవారాల్లో కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులు తెలిపారు. కాగా, అల్లీపురంలో దరఖాస్తుల స్వీకరణను 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు ప్రారంభించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక లాటరీ ద్వారా ఇళ్లు కేటాయిస్తామని అధికారులు తెలిపారు.

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయాలని కోరుతూ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనెల 5న ఆయన జయంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కో కన్వీనర్ బెల్లంకొండ శ్యామల, వీరస్వామి, కోటేశ్వరావు, శ్రీను, గురవయ్య, సుబ్బయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురంలో అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న బాధితులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోటాలో మంజూరైన రూ.88,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సీపీఎం మండల నాయకులు వి. సుదర్శన్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల నాగయ్య, డి.వెంకటేశ్వర్లు, నర్సింహరావు, ఏ. శ్రీను, పొన్నెకంటి అనీష్, డి.బ్రహ్మం, టి.లింగయ్య, కె.రవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టకోటలో 'కంటి వెలుగు'

ఖమ్మంఅర్బన్: నగరంలోని 15వ డివిజన్ పరిధిలోని పుట్టకోటలో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈశిబిరాన్ని సోమవారం కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు ప్రారంభించి పరీక్షలు చేయించుకున్న పలువురికి కంటి అద్దాలు అందజేశారు. బీరెడ్డి సత్యవర్ధన్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాములోరికి పవళింపు సేవ



అలంకరణలో స్వామి వారు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ రామనవమి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని గాంధీచౌక్‌లో సోమవారం రాత్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదాంతం లక్ష్మీ నారాయణ చార్యులు, వేదాంతం ఫణికుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మహిళలు కోలాటం, నృత్యాలు చేశారు. వేడుకల అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోహన్, కోశాధికారి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

కేఎండీసీలో శిక్షణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో క్యాంపస్ టూ కార్పొరేటు శిక్షణ సోమవారం ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి తెలిపారు. టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో డిగ్రీ ఫైనల్ ఈయర్ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ అవగాహన నిర్వహించామన్నారు. ట్రైనర్, రిసోర్స్‌పర్సన్ ఆంటోని డిసౌజా, కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు, ట్రైనింగ్ అండ్ అసెస్మెంట్ ఆఫీసర్ పాపారావులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి పోస్టుకార్డులు

కూసుమంచి: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయటం రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ సోమవారం యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రపతి, ప్రధాని మోదీకి లేఖలు రాసారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ పాలేరు డివిజన్ ప్రధాన కార్యదర్శి బెల్లి శ్రీశైలం, ఎన్‌ఎస్‌యూఐ మండల కన్వీనర్ బాణోత్ హరినాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టగా నాయకులు ఎండీ.హఫీజుద్దీన్, పెండ్ర అంజయ్య, బాపోత్ పీర్యా నాయక్, బెల్లంకొండ శరత్, కొండా శ్రీనివాస్, కిరణ్ తదితరులు మాట్లాడారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నేలకొండపల్లి: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఇఫ్టూ పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్యాధికారి రాజేష్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు సెలవులు మంజూరు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కనీస వేతనం రూ.21 వేల వేతనాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా కాంట్రాక్ట్ వ్యవస్థ కొనసాగటం దుర దృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు హీరాలాల్, కమలమ్మ, రమాదేవి, ఆనంద్, శ్రీలత, రంగమ్మ, కౌసల్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులను అప్పుల ఊబిలోకి నెట్టిన ప్రభుత్వం

ఖమ్మం సహకారనగర్: రైతుల రుణాలు మాఫీ చేయకుండా రాష్ట్రప్రభుత్వం వారిని అప్పుల ఊబిలోకి నెట్టిందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ భూక్యా చంద్రకళ విమర్శించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌పై అనర్హత వేటు వేసిన బీజేపీ ప్రభుత్వంతో పాటు రైతులకు ఇబ్బంది పెడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్ మాట్లాడగా నాయకులు ధరావత్ రాణి, భూక్యా చిన్నానాయక్, శీలం బ్రహ్మారెడ్డి, కొంపెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరాములుకు నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని కొత్తూరులో 'డేర్' ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు దరిపల్లి అనంతరాములు జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ కళాశాల స్థాపించిన నాటి నుంచి విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యనందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నామని తెలిపారు. అలాగే, అనంతరాములు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు ఖమ్మం, నల్లగొండ జిల్లాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కరస్పాండెంట్ స్వాతితో పాటు అప్పారావు, లాలు, ప్రవీణ్, మూర్తి, ప్రభాకర్, డి. వెంకటేశ్వర్లు, అనిల్, రామయ్య పాల్గొన్నారు.

'హార్వెస్ట్'కు ర్యాంక్‌లు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: జాతీయ స్థాయిలో అడ్వాన్స్‌డ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కమ్యూటర్ సైన్స్ నిర్వహించిన 13వ ఒలంపియాడ్ పరీక్షలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్‌తో పలు ర్యాంక్‌లు సాధించినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జనవరి నెలలో పరీక్ష జరగ్గా కిలారు హర్షిత్ జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్, కిలారు పన్విక్ 3వ ర్యాంక్ సాధించారన్నారు. వీరితో పాటు శరత్‌చంద్ర, శ్రీకర్‌రెడ్డి, రేవంత్‌కుమార్, వెంకటకృష్ణ, ఉన్నికృష్ణ, అన్విదారెడ్డి, జగత్, యశస్విని తదితరులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారన్నారు. జూన్ 29న జరిగే స్టాటిస్టిక్స్‌డే సందర్భంగా బహుమతులు అందజేస్తారన్నారు. ఉపాధ్యాయ, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ యువతకు ఆదర్శం

రఘునాథపాలెం: భగత్‌సింగ్ యువతకు ఆదర్శమూర్తి అని దేశం కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టారని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పాలేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని కామంచికల్‌లో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా పోటీలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. మొదటి బహుమతిగా రూ.5,000 కామంచికల్ జట్టుకు, రెండో బహుమతి ముత్యాలగూడెం జట్టుకు రూ.3,016 రూపాయలు షీల్డ్ అందించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నాయకులు చెరుకూరి మురళీకృష్ణ, డీవైఎఫ్‌ఐ గ్రామ కార్యదర్శి వంశీ, ముస్తఫా, రాము మహేష్ తదితరులు పాల్గొన్నారు

'పది' పరీక్షలు ప్రారంభం



ఖమ్మంరూరల్: కారుణ్య విద్యా భవన్‌లో పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు

పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. విద్యార్థుల్ని పరిశీలించి సిబ్బంది లోనికి అనుమతించారు. అధికారులు పరీక్షాకేంద్రాల్లో తనిఖీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: మంచుకొండ పరీక్షా కేంద్రంలో..



కూసుమంచి: పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



నేలకొండపల్లి: సింగారెడ్డిపాలెం గురుకులం వద్ద..



తిరుమలాయపాలెం: పిండిప్రోలులో..

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి



ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దొడ్డి కొమరయ్య జయంతిని సోమవారం ఖమ్మం నగరంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం దొడ్డి కొమరయ్య జయంతిని అధికారికంగా నిర్వహించడంతో కేఎంసీలో ఆయన చిత్రపటానికి మేయర్ పునుకొల్లు నీరజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో, సీపీఐ కార్యాలయంలో దొడ్డి కొమరయ్య జయంతిని నిర్వహించారు.



ఖమ్మంఅర్బన్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో..

ఖమ్మంఅర్బన్: సమ సమాజ నిర్మాణానికి తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చేసిన ఉద్యమాలు అజరామరమని అఖిల భారత యాదవ్ మహాసభ నాయకులు అన్నారు. నగరంలోని రోటరీనగర్‌లోని మహాసభ జిల్లా కార్యాలయంలో కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు చిలకల వెంకటనర్సయ్య , అఖిల భారత యాదవ్ మహాసభ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి, పాదిల సతీష్, తెల్లబోయిన రమణ, సత్తి వెంకన్న, వాకదాని కోటేశ్వరరావు, ప్రభాకర్, పాదిల భూపతి, మొర్రిమేకల అమరయ్య, కన్నెబోయిన రవి, శ్రీనివాస్, చలపతి పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య వనంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు కోడి లింగయ్య, మహేందర్, నాగేశ్వరరావు, నాగులు, బాబు, కొమ్ము నాగేశ్వరరావు, వెంకన్న, భిక్షం తదితరులు పాల్గొన్నారు.